ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతుల వెల్లువ

ప్రజాశక్తి-కుప్పం టౌన్
కుప్పం పట్టణం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో కడా పీడీ వికాస్ మరమత్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుండి విశేష స్పందన వచ్చింది. ఈ వేదికకు వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 29 సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించినట్టు తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 7, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి 6, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 3, హౌసింగ్ కార్పొరేషన్ శాఖకు సంబంధించి 2, పోలీసు శాఖకు సంబంధించి 2, సోషల్ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 2, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 1 వినతులు వచ్చినట్టు తెలిపారు. వీటి పరిష్కారం కొరకు ఆయా శాఖల అధికారులకు ప్రజల వినతులను కేటాయించడం జరిగిందని, సమయపాలన మించకుండా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

హామీలు అమలు చేయండి

- కలెక్టరేట్ ఎదుట ఆశాల ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆశాలు ధర్నా చేయడం జరిగింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా మాట్లాడుతూ ఆశాల లక్ష్యం నెరవేరకుండా అదనపు పనులు చేయించడం దారుణమన్నారు. మాతా, శిశు సంరక్షణ చేయాల్సిన ఆశలు ఇతర పనులన్నీ చేయిస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనం, గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్స్ చనిపోయిన వారికి చెల్లించాలి ఆశా కార్మికులకు పనిభారం తగ్గించాలని కోరారు. అలాగే ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, అధికారులు చేయిస్తున్న వెట్టిచాకిరి వెంటనే మానుకోవాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పొడిగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలన్నింటిని అమలు చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశాల సమస్యలను పరిష్కారం చేయడంలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను భర్తీ చేయడంతోపాటు, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాకు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి అధ్యక్షత వహించగా నాయకులు, అనురాధ, సుబ్బలక్ష్మి, వనజాక్షి, సావిత్రి, సురేఖ, పద్మ, నలిని పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

అత్యవసర సేవలందిస్తున్నాం.. ఆదుకోండి..

- కలెక్టరేట్ ఎదుట 108 ఉద్యోగుల రిలే దీక్ష

కలెక్టరేట్ ఎదుట 108 ఉద్యోగులు నిరసన దీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అత్యవసర సేవలు అందిస్తున్నాము.. ఆదుకోండి.. కనీసం వేతనాలు అమలు చేసి మా సమస్యలు పరిష్కరించండి అంటూ 108 ఉద్యోగులు సోమవారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ 108 సేవలను కాంట్రాక్టర్లు ఇవ్వడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందన్నారు. ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా నిర్వహించడం వల్ల ప్రజాధనం వృథా కాకుండా అరికట్టవచ్చు అన్నారు. అత్యవసర సేవలను కాంట్రాక్టర్లు ఇవ్వడం ద్వారా ఉద్యోగుల హక్కులను కాలరాస్తు కనీస వేతనాలు అమలు చేయడం లేదని, విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగులకు ఎలాంటి పరిహారం అందం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 108 అంబులెన్స్ సర్వీస్‌లోని ఉద్యోగులు సమస్యలు పరిష్కరించమని కోరుతూ గత కొద్ది రోజులుగా యాజమాన్యంకు, అధికారులకు వినతి అందించి శాంతియుతంగా పలు నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అయినప్పటికీ యాజమాన్యం కానీ, ప్రభుత్వ అధికారులు కానీ సమస్యలు పరిష్కారం కాలేదని, దీంతో సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద విధులలో లేని ఉద్యోగులు ఒక రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టామన్నారు. 108 అంబులెన్స్ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, 108 ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రోజుకు మూడు షిఫ్ట్‌లలో 8 గంటల పనివిధానం అమలు చేయాలని, సర్వీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ మార్కులు అందించాలని, వైద్య ఆరోగ్యశాఖ నియామకాల్లో 108లో పనిచేస్తున్న వారిని నియమించాలని డిమాండ్ చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అమలు పరిచిన జీఓ.నెం.ఎంఎస్ 49ను అనుసరించి నెలకు రూ.4వేలు చెల్లింపును తిరిగి పునరుద్ధరించాలని కోరారు. సహజ, ప్రమాద మరణం పొందిన ఉద్యోగి కుటుంబంకు రూ.25లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలని, 108 వాహనాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని, ప్రస్తుత నిర్వహణ సంస్థ నుండి ఉద్యోగులకు రావల్సిన బకాయిలను పూర్తిగా చెల్లించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 108 ఉద్యోగుల పోరాటానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర గుప్తా, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

అభివృద్ధికి నిధులు ఇవ్వండి..

- అసెంబ్లీలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరును పురపాలక స్థాయి నుండి కార్పొరేషన్ స్థాయికి మార్చినా ఆ స్థాయిలో అభివృద్ధి జరగలేదని.. ప్రత్యేక నిధులు మంజూరు చేసి చిత్తూరు నగరపాలక సంస్థను రాష్ట్రంలోని పెద్ద కార్పొరేషన్ల దీటుగా అభివృద్ధి చేయాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అసెంబ్లీ వేదికగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణను కోరారు. సోమవారం జీరో అవర్లో ఎమ్మెల్యే మాట్లాడారు. చిత్తూరు పురపాలకను కార్పొరేషన్‌గా స్థాయి మార్చినా ఆ దిశలో అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్రంలో మిగిలిన కార్పొరేషన్ల స్థాయిలో చిత్తూరులో అభివృద్ధి చేయాలని, ఇందుకోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని సభ ఉపాధ్యక్షులు ద్వారా పురపాలక శాఖ మంత్రిని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రపంచ దేశాలు అన్ని చూసి ఎంతో ఆదర్శవంతంగా అమరావతిని రూపకల్పన చేశారని.. ఇదే స్ఫూర్తితో తన నియోజకవర్గంలోని చిత్తూరు కార్పొరేషన్‌ను అభివృద్ధి చేయడానికి వీలుగా ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

పకడ్బందీగా ఆర్‌బిఎస్‌కె స్క్రీనింగ్ పరీక్షలు

కమిషనర్ నరసింహ ప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : నగరపాలక పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆర్‌బిఎస్‌కె స్క్రీనింగ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ఆర్‌బిఎస్‌కే (రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం) ద్వారా వ్యాధి నిర్ధారణ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై అర్బన్ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఆరోగ్య కార్యదర్శులు, అంగన్వాడీ సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరపాలక పరిధిలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని 0 నుంచి 18 సంవత్సరాల విద్యార్థులను పరీక్షించాలన్నారు. ప్రతి విద్యార్థికి సంబంధించి డిఫెక్ట్స్ అట్ బర్త్, డీసీజస్, డెఫిషియన్సీ, డెవలప్మెంట్ డిలేస్ అంశాలపై నిర్దేశించిన పరీక్షలతో స్క్రీనింగ్ చేయాలన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు గుర్తించిన వెంటనే పూర్తి వివరాలతో డీఈఐసీకి పంపాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై నగరపాలక ఆరోగ్యాధికారి డాక్టర్ లోకేష్ అవగాహన కల్పించారు. సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, సీడీపీవో సునంద పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన అడిషనల్ ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్‌రాజు సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జడ్జి భీమారావు, జాయింట్ కలెక్టర్ విద్యాధరిని వారివారి కార్యాలయాలలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

రాజేష్ కుమార్‌పై వన్‌టౌన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సోషల్ మీడియాలో ప్రముఖ రాజకీయ నాయకులపై దుష్ప్రచారానికి పాల్పడుతున్న వైసీపీ కార్యకర్త పాలేటి రాజ్ కుమార్‌పై చిత్తూరు వన్ టౌన్ సిఐ వద్ద ఫిర్యాదు చేశారు. టిడిపి చిత్తూరు నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు జాఫర్, వన్నికుల క్షత్రియ నాయకుడు, విజయ్ కుమార్, కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, న్యాయవాది శ్రీనివాస్ బాబు, జిల్లా వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి గోపాల్ పాల్గొన్నారు.

విన్నపాలు వినవలే..

- సమస్యలు బోలెడు.. పరిష్కారం చూపరూ..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అర్హత ఉన్నా పింఛను రాదు.. కాస్తో..కూస్తో భూమి ఉంటే కబ్జాదార్లు ఆక్రమించుకొని వెళ్ళగొడుతున్నారు... అంగవైకల్యం ఉన్నా సదరం సర్టిఫికేట్స్ ఇవ్వరు.. ఇదేంది సారు.. అంటూ తహశీల్దార్లు చుట్టూ కాళ్ళరిగేలా తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. సరే ప్రజాసమస్యల పరిష్కార వేదిక అంటున్నారు.. ఇక్కడైనా సమస్యలు పరిష్కరిస్తారనుకుంటూ పనులు వదులుకొని జిల్లా కలెక్టరేట్‌కు వస్తున్నారు.. జిల్లా ప్రజలకు.. అయితే ఇక్కడి వచ్చి క్యూలైన్‌లో నిలబడి అర్జీల్చినా తమ పరిస్థితి మారడమూ లేదు.. పరిష్కారం కావడమూ లేదంటూ కలెక్టరేట్ ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వస్తున్న అర్జీదారులు అంటున్నారు.

ముఖ్యంగా భూసమస్యలే అధికంగా వస్తున్నాయి. కింది స్థాయిలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తున్న వేదికలకు రెవెన్యూ సమస్యలే అధికం. ఈ వారం కూడా కలెక్టరేట్‌లో నిర్వహించిన వేదికలో 190 ఫిర్యాదుల్లో 161 రెవెన్యూ సమస్యలే.. జిల్లాలో ఏ స్థాయిలో రెవెన్యూ సమస్యలున్నాయో తెలుస్తోంది. పదేపదే ప్రజల నుండీ అందే ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టి అధికారులు పరిష్కరించాలని, ప్రతీ అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని, ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని, ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలని కలెక్టర్ ప్రతి వారం చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఇది జరగడం లేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ-ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందని ఆదేశాలు జారీ చేస్తున్నా కింద స్థాయి అధికారుల్లో చలనం లేకపోవడంతో అర్జీలు చేతబట్టుకొని వారంవారం కలెక్టరేట్‌కు వచ్చి క్యూలైన్‌లో నిలబడాల్సి వస్తోందని అర్జీదారులు ఆవేదన వాపోతున్నారు.

రెండేళ్ళగా తిరుగుతున్నా...

- ఏకాంబర రెడ్డి, యాదమరి మండలం.



నాది యాదమరి మండలం దొమ్మడిఊరు. మాకు మా పూర్వీకుల నుండీ సంక్రమించిన భూమిని మోహన్ అనే సర్వేయర్ అడంగల్ మార్చి పట్టాను మార్చేశాడు. 1.75 సెంట్ల వ్యవసాయ భూమి కోసం యాదమరి తహశీల్దార్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో కలెక్టరేట్, ఆర్‌డిఒల చుట్టూ గత రెండేళ్లుగా తిరుగుతూనే ఉన్నా అయినా న్యాయం జరగలేదు..

దుకాణం ఏర్పాటు చేసుకొనే అవకాశమివ్వండి

- గోపాల్, వికలాంగుడు

నాకు రెండు కాళ్ళు లేవు. జిల్లా కోర్టు ఆవరణంలో చిన్నపాటి దుకాణం ఏర్పాటు చేసుకొని కుటుంబాన్ని పోషించుకొనే అవకాశం కల్పించండి అంటూ చిత్తూరు రూరల్ మండలం తాళంబేడు గ్రామానికి వికలాంగుడు తెలిసిన వారిని వెంటబెట్టుకొని మూడు చక్రాల వాహనంలో కలెక్టర్‌ను ఆశ్రయించాడు.

కళ్ళులేవు కనికరించండి..

నాకు కళ్ళులేవు కనికరించండి అంటూ తిరుపతి అంధుల హాస్టల్‌లోని అంధులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. తిరుపతి అంధుల హాస్టల్‌ను విభిన్న ప్రతిభావంతులశాఖ ఏడి ఏమాత్రం పట్టించుకోవడం లేదని, ఎప్పుడో నెలకో రెండు నెలలకోఓసారి వస్తారని కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నీటి సదుపాయం కోసం దీర్ఘకాలికంగా బోరు మంజురు చేయాలని పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో నీటి ట్యాంకర్ ద్వార సరఫరా చేస్తున్నారని, కనీసం వాచ్‌మెన్‌కూడా లేకపోవడంతో తమ అవస్థలు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి తమ సమస్యలు పరిష్కారించాలని వేడుకుంటున్నారు..

మా భూమిని ఆక్రమించుకున్నారు..

- సుబ్రమణ్యం, రైతు, సోమల మండలం

మా భూములను సర్వేనెంబర్లు మార్చి అక్రమించుకున్నారు. మూడు వారాలుగా ప్రజాసమస్యల పరిష్కారవేదికకు వస్తున్నా అర్జీ ఇస్తున్నా కానీ ఇప్పటి వరకు న్యాయం జరగలేదు. సోమల మండలం తూండువారిపల్లిలో సెటిమెంట్ భూమి 50 సంవత్సరాలకు పైగా సాగు చేస్తున్నాను. నా భూమిని కొందరు దౌర్జనంగా ఆక్రమించుకొని సర్వే నెంబర్లు మార్చి అన్యాయం చేస్తున్నారు. సోమల తహశీల్దార్‌కు ఆరుసార్లు అర్జీలు ఇచ్చిన పట్టించుకోలేదు. దీంతో ఇక్కడైనా సమస్య పరిష్కారం అవుతుందని కలెక్టరేట్‌కు మూడు వారాలుగా తిరుగుతున్నాడు. ఇంకా పరిష్కారం కాలేదు..

ఆధార్ లింక్ లేదంటూ పింఛన్ నిలిపేశారు..

చిత్తూరు పట్టణం ఇరువారంలోని సిబిఎన్ కాలనీకి చెందిన ఎస్.కుమారికి గతంలో వితంతు పింఛన్ అందేది. ఆధార్‌తో అనుసంధానం కాలేదంటూ కారణం చూపి పింఛన్ నిలుపుదల చేయడం జరిగింది. అధికారులకు ఆధార్‌తో లింకు చేసి తనకు పింఛన్ మంజురు చేయాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకుంది.

భారీ వాహనాలతో ఇబ్బందులు

నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు, ఇఫ్రానియా విద్యార్థులు స్కూల్‌కు వెళ్ళే సమయంలో రోడ్డుపై భారీ వాహనాలు, ఇసుక ట్రాక్టర్లు, నీటి ట్యాంకర్‌లు వస్తున్నాయని, వీటి వలన విద్యార్థులు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా స్కూల్ టైమింగ్‌లో భారీ వాహనాలు రాకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ వెంటనే స్పందించి వెంటనే సమస్యను పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.

అంబేద్కర్ భవన్ నిర్మాణంకు స్థలం కేటాయించండి

ఐరాల: మండల పరిధిలోని కాణిపాక పరిసరాల్లో ఉన్న ఖాళీగా ఉన్న ప్రభుత్వభూమిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరుపై నిర్మాణానికి స్థలం కేటాయించాలని స్థానిక దళిత నాయకులు సోమవారం చిత్తూరులో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టన్ వెంటనే సాంఘిక సంక్షేమ జాయింట్ డైరెక్టర్‌ని పిలిచి భవన నిర్మాణానికి స్థలపరిశీలన చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. దళిత నాయకులు నటరాజ్, బొమ్మసముద్రం సర్పంచ్ రఘు, అవార్డు రవి, జనసేన నాయకులు ఎం.మహేష్ స్వేరో, ధనంజయ, రామ చంద్రయ్య, కుమార్, నగేష్, రాజేంద్ర ఉన్నారు.

త్వరితగతిన పరిష్కరించండి: ఎస్పీ

ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పి మణికంఠ చందోలు ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పని చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పి, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్ఆర్.రాజశేఖర్‌రాజు, చిత్తూరు డీఎస్పీ .సాయినాథ్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 37 ఫిర్యాదులు అందాయి. చీటింగ్ 2, కుటుంబ తగాదాలు 8, వేధింపులు 2, ఇంటి తగాదాలు 2, భూ తగాదాలు 16, డబ్బు తగాదాలు 4, ఆస్తి తగాదాలు 3 ఉన్నాయి.

ప్రజాఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పి మణికంఠ చందోలు

అక్రమ క్వారీని ఆపాలని వినతి

విజయపురం (నగరి): నగరి పట్టణ పరిధి కీళపట్టు సమీపంలో ఉన్న అక్రమ క్వారీ ఆపాలని గ్రామస్తులు సోమవారం చిత్తూరు జిల్లా డీఆర్‌వో కుమార్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ కీళపట్టు సమీపంలో అక్రమ క్వారీ నిర్వహిస్తున్నారని, వాటి నుంచి వచ్చే దుమ్ము, ధూళితో గర్భవతులు, చిన్నపిల్లలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాత్రి పూట ప్రమాదకరమైన బాంబులు వాడుతున్నారని, అందులో నుంచి వచ్చే శబ్దంతో నిద్ర ఉండటం లేదని, గతంలో అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ క్వారీని నిలిపివేయాలని కోరారు.

గోకులం షెడ్ల నిర్మాణ పురోగతిపై కలెక్టరు అసహనం

నిర్మాణ పనులను వేగవంతం చేయండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
పాడి పశువుల సంక్షేమానికి చేపట్టిన గోకులం షెడ్ల నిర్మాణంలో పురోగతి తక్కువగా ఉండడంతో పశుసంవర్ధక శాఖ ఏడీలు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీలు ఏపీఓల పనితీరుపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో గోకులం షెడ్ల నిర్మాణ పురోగతిపై పశు సంవర్ధక శాఖ ఏడీలు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీలు, ఏపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాడి పశువుల పెంపకానికి అనువుగా గోకులం షెడ్ల నిర్మాణంను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత అంశంగా చేపట్టిందని, ఈ కార్యక్రమాన్ని సజావుగా క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు పశు సంవర్ధకశాఖ అధికారులు, ఏపీడీలు, ఏపీఓలు సమన్వయంతో పనిచేసి మండలాలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కొన్ని మండలాలలో మార్కింగ్ చేసి పనులు ప్రారంభించకపోవడం, మరికొన్ని మండలాలలో షెడ్ల నిర్మాణం పూర్తి అయినా బిల్లులు అప్లోడ్ చేయకపోవడంపై సంబంధిత అధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని పదేపదే చెబుతున్నామని ఆ దిశగా అధికారులు ఎందుకు పనిచేయడం లేదన్నారు. మార్కింగ్ చేసిన చోట పనులను వెంటనే ప్రారంభించాలని నాలుగు స్టేజీల్లో బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. పనులు పూర్తి అయిన వెంటనే ఎం.బుక్ రికార్డు చేసి బిల్లులు అప్లోడ్ చేయాలని నిధుల కొరత లేదని పాడి రైతులకు ఈవిషయంపై అవగాహన పెంచి నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా పనిచేయాలన్నారు. మండలానికి మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణంలో నిర్మాణాలు చేపట్టనిచోట అవి రద్దుచేసి ఆసక్తి ఉన్న పాడి రైతులకు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. గోకులం షెడ్ల నిర్మాణంపై గ్రామసభలను నిర్వహించి ప్రజాప్రతినిధుల సమన్వయంతో అవగాహన తీసుకురావాలని ఈ విషయంలో మండల స్థాయిలో గల పశుసంవర్ధక శాఖ సహాయకులను పూర్తిగా భాగస్వామ్యం చేసి రైతులతో స్వయంగా వెళ్లి మాట్లాడి నిర్మాణాలు జరిగేలా మరింత బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు.

గోకులం షెడ్ల నిర్మాణంపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

కనకదాస కీర్తనలు ప్రాచుర్యం పొందాయి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
కనకదాసు కర్ణాటకలో ఆధునిక కవి, తత్వవేత్త, సంగీతకారుడు, స్వరకర్త అని కర్ణాటక సంగీతం కోసం కన్నడ భాషలో రచించిన కీర్తనలు, ఉపభోగాల వలన బాగా ప్రాచుర్యం పొందారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కనక దాస జయంతిలో భాగంగా జిల్లా సచివాలయంలోని పాత గ్రీవెన్స్ హాల్‌లో భక్త కనకదాస చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ కనకదాస చిన్న వయస్సులోనే నరసింహ స్తోత్రం, రామధ్యాయ మంత్రం, మోహన తరింగిణి అనే కవిత్వాలను రచించారన్నారు. సామాన్యులకు అర్థమయ్యే విధంగా కన్నడ భాషలో రచనలు చేస్తూ, కీర్తనలు రాస్తూ, వేదాంతాన్ని అభ్యసించి గొప్ప కృష్ణ భక్తుడయ్యారన్నారు. జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, డీఈవో వరలక్ష్మి, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి రబ్బానీ బాషా, సోషల్ వెల్ఫేర్ డిడి రాజ్యలక్ష్మి, ఈడీ బీసీ కార్పొరేషన్ శ్రీదేవి, జిల్లా ఎంప్లాయ్మెంట్ అధికారి పద్మజ, డీపీఓ పార్వతి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.

పలమనేరులో టిడిపి ఆఫీసులో ఘనంగా కనకదాస 537వ జయంతి వేడుకలు కురబ సంఘం నాయకుల ఆధ్వర్యంలో జరిగింది. కనకదాసు చిత్రపటానికి పూజలు నిర్వహించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సుబ్రమణ్యం గౌడ్‌ను ఆ సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. మాజీ మార్కెట్ కమిటీ రామచంద్ర నాయుడు, సోమశేఖర్ గౌడ్, బత్తి గౌడ్, ఈశ్వర్ గౌడ్, విశ్వనాథ్, చంద్రప్ప గౌడ్, సుబ్బు గౌడ్, రామచంద్ర, శేషు, గంటలప్ప గౌడ్ పాల్గొన్నారు.


పలమనేరులో కనకదాస చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

శ్రీనాథరెడ్డి(ఫైల్)

ప్రజాశక్తి-చౌడేపల్లి: మండలంలోని పంచాయతీ కేంద్రం ఓదెలపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆకస్మికంగా మృతి చెందాడు. పంచాయతీ కేంద్రం చాలాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన సి శ్రీనాథరెడ్డి పదవి విరమణ చెందారు. ఆదివారం తన నివాసంలో గుండెపోటుతో ఆకస్మికంగా ఆయన మృతి చెందారు. మంచితనమే మారుపేరుగా ఉన్న శ్రీనాథ్ రెడ్డి మృతి చెందడంతో రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

రేపు బందార్లపల్లిలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి, గ్రామస్థాయి అవసరాలను గుర్తించడానికి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కడా పీడీ వికాస్ మరమత్ తెలిపారు. రామకుప్పం మండలం బంధార్లపల్లి గ్రామంలో బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని గత బుధవారం కుప్పం మండలం కంగుంది గ్రామంలో ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అనంతరం వాటిని అక్కడికక్కడే పరిశీలించి, వీలైనంతవరకు సమస్యలకు పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామ పరిధిలో క్షేత్రస్థాయి పర్యటన చేపడుతామన్నారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం

ప్రజాశక్తి-పూతలపట్టు: మండలంలోని మూర్తిగారు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజ శేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ మేరకు వైసిపి నాయకులు సోమవారం పూతలపట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఇది ముమ్మాటికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పనేనన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి వారి అభివృద్ధికి చేదోడుగా నిలిచిన దివంగత నేత విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. దీనిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

'ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతాం'

వినతులు స్వీకరిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రజల వద్ద నుంచి అందిన ప్రతి అర్జీకి అర్థవంతమైన పరిష్కారం చూపుతామని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు 23అర్జీలు సమర్పించినట్లు తహశీల్దార్ వివరించారు. వాటి పరిష్కారానికి వెనువెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి సంబంధించి అక్కడికక్కడే వీఆర్‌వోలను ఆదేశించారు.

బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

సూచనలు ఇస్తున్న నరసింహ బాబు

ప్రజాశక్తి-కార్వేటినగరం: పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దని అసిస్టెంట్ అకౌంట్ అధికారి నరసింహబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఈఆర్‌వో కార్యాలయంలో విద్యుత్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పునర్విభజనలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన కార్వేటినగరం డివిజన్లో ఉన్న విద్యుత్ బకాయిల వసూళ్లలో జిల్లాకు ఆదర్శంగా తీసుకురావాలని సూచించారు. పెండింగ్ బిల్లుల వసూళ్లపై విద్యుత్ సిబ్బంది ఎలాంటి ఆలసత్వం చేయకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అదే విదంగా ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన బిల్లులపై ప్రత్యేక దృష్టి సారించి బిల్లులు చెల్లించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ చంద్రబాబు, ఏఈ రామూర్తి, లైన్ ఇన్స్పెక్టర్ దాము, పలువురు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పురపాలక సంఘం పరిసరాల పచ్చదనానికి చేపట్టిన కార్యక్రమాలు

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజలందరి సహకారంతోనే అభివృద్ధి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు

కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ప్రజలందరి సహకారంతోనే కుప్పం పట్టణ అభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత మెరుగుపడుతుందని పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉంటూ మున్సిపల్ అధికారులకు సహకరించాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్యం మెరుగ్గా ఉండాలన్నారు. పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. పట్టణంలో చేపడుతున్న నూతన ఆవిష్కరణలపై ప్రజాశక్తితో మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక ఇంటర్వ్యూ..

ప్రజాశక్తి: పరిసరాల పరిశుభ్రతకు మీరు ప్రత్యేకంగా తీసుకుంటున్న చర్యలు ఏంటి?

కమిషనర్: పట్టణంలోని అన్ని ప్రాంతాలలో కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం, రోడ్లపై పడి ఉన్న చెత్తను తీసివేయడం, ముఖ్యంగా చెత్త వాహనాల ద్వారా ప్రతి ఇంటి వద్ద చెత్తను సేకరించడం వంటివి చేపడుతున్నాం.

ప్రజాశక్తి: పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారా..?

కమిషనర్: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అనునిత్యం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశాం. పురపాలక సంఘం తరపున చేపడుతున్న ప్రతి కార్యక్రమంలోనూ పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పురపాలక సంఘం సూచనలను అధిగమించిన వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించడం జరిగింది.

ప్రజాశక్తి: పురపాలక సంఘం హెచ్చరికల ప్రకారం ఇంతవరకు ఎవరికైనా జరిమానాలు విధించారా?

కమిషనర్: ప్రజలు ఎవరైనా రోడ్లపై చెత్త పడేస్తే పెద్ద మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరికలు జారీ చేయడం జరిగింది. ఇంతవరకు ఆ హెచ్చరికలను అమలు చేయవలసిన పరిస్థితి ఏర్పడలేదు. ముఖ్యంగా కుప్పం పురపాలక సంఘం నూతనంగా ఏర్పడడం చేత పురపాలక సంఘం అధికారులు సమన్వయం పాటిస్తూ ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా రోడ్లపై చెత్త పడేస్తే తప్పకుండా పురపాలక సంఘం హెచ్చరికలను అమలు చేస్తాం.

ప్రజాశక్తి: పట్టణ అభివృద్ధికి పురపాలక సంఘం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు ఏంటి?

కమిషనర్: పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంలో భాగంగా డ్రైనేజీలు, రోడ్ల, మరుగుదొడ్ల నిర్మాణం, పార్కులను అభివృద్ధి చేయడం, రోడ్ల విస్తరణ వంటి కార్యక్రమాలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపడం జరిగింది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభిస్తాం.

ప్రజాశక్తి: పట్టణ పరిధిలో నూతనంగా పార్కులను ఏర్పాటు చేస్తారా?

కమిషనర్: పట్టణ నడిబొడ్డులోని రాజావారి పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తాం. అలాగే దలవాయి కొత్తపల్లి, మోడ్రన్ కాలనీ వంటి ప్రాంతాలలో నూతన పార్కులను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

ప్రజాశక్తి: పురపాలక సంఘం ఆదాయ వనరులను పెంచుకోవడానికి మీరు చేపడుతున్న చర్యలు ఏంటి?

కమిషనర్: ఆదాయ వనరులను పెంచుకోవడానికి పట్టణ పరిధిలోని పన్నులను పెంచడం వంటివి చేయకుండా ఇప్పటికే ఉన్న పాత గృహాలను సర్వే చేసి, పురపాలక సంఘం నియమ నిబంధనల ప్రకారం వాటన్నింటినీ పన్నుల పరిధిలోనికి తీసుకురావడం. పట్టణ పరిధిలో నూతన నిర్మాణాలకు తప్పనిసరిగా పురపాలక సంఘం అనుమతులు తీసుకునేలా జాగ్రత్తలు వహించడం వంటివి చేస్తున్నాం.

ప్రజాశక్తి: ప్రభుత్వానికి మీరు చేసిన ప్రతిపాదనల ప్రకారం పట్టణాభివృద్ధికి ఎంతకాలం పడుతుంది?

కమిషనర్: కుప్పం పట్టణ అభివృద్ధికి పురపాలక సంఘం పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించి నిధులను మంజూరు చేస్తే సంవత్సర కాలంలో పట్టణ అభివృద్ధిని పూర్తి చేసి, ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తాం. మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తాం.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-విజయపురం(నగరి): దేశవ్యాప్తంగా సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి జరుగుతోందని నగరి బ్రాంచ్ మేనేజర్ కీర్తిసుధా అన్నారు. సోమవారం నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు సోమవారం జరిగింది. నగరి పిఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జ్ కేవీఆర్ కుమార్ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ, ప్రతీ ఏటా నవంబరు 14 నుంచి వారం రోజులపాటు సహకార వారోత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. 1904లో దేశంలో ఏర్పాటైన సహకార వ్యవస్థ రోజురోజుకూ బలోపేతం అవుతోందని అన్నారు. సంఘ సీఈవో తులసిపిళ్లై మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో కూడా సహకార సంఘాల ప్రాధాన్యతను పెంచేందుకు తాజాగా ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఇప్పటికే పెట్రోల్

పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

బంక్ నిర్వహణతో పాటు రైతులకు వ్యవసాయ రుణం అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే కంప్యూటరీకరించే ప్రక్రియను శరవేగంగా నిర్వహిస్తున్నామని వివరించారు. దీని ద్వారా సహకార సంఘాలపై మరింత నమ్మకం, పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. గ్రామీణ స్థాయిలోని సహకార సంఘాలను కేవలం ఆర్థిక కార్యకలాపాలకే పరిమితం చేయకుండా, ఇతర కార్యక్రమాలకు కూడా విస్తరిస్తున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు ఆనంద్, వెంకటేష్, శేఖర్, దుర్గా ప్రసాద్, లేపాక్షి, కార్తీక్, తనికాచలం, రైతులు పాల్గొన్నారు.

'ప్రస్తుత పాఠశాల వేళలనే కొనసాగించాలి'

ప్రజాశక్తి-పుంగనూరు: ఉన్నత పాఠశాలల పనివేళలకు సంబంధించి, ప్రస్తుతం వున్న సమయాన్నే కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘం నేతలు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉదయం 9గం నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగిస్తే మంచిది. అలా కాని పక్షంలో గతంలో వున్న సమయపాలన కొనసాగిస్తే విద్యార్థులందరూ ఉదయం అల్పాహారం తిని బడికి రావడానికి వీలవుతుంది తెలిపారు. ఉదయం 9గంటలకు బడి ప్రారంభం కావడంతో సగం మంది విద్యార్థులు అల్పాహారం తీసుకోకుండా రావడంతో నీరసంగా ఉంటారని పేర్కొన్నారు. వీలైతే బడి సమయాన్ని ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకూ నిర్ణయిస్తే, ఉదయం అల్పాహారం తీసుకోవడానికి సాయంత్రం వెలుతురులోనే ఇళ్లకు చేరడానికి విద్యార్థులకు ఎంతో సౌలభ్యంగా వుంటుంది అని వివరించారు. చాలా మంది విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి ఆటోల్లో, బస్సుల్లో రావడానికి వెళ్లడానికి వీలవుతుంది అని, అలా కాకుండా బడి సమయాన్ని ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ నిర్ణయిస్తే విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ అన్ని విధాలా అవస్థలకు గురి కాగలరని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నాటు సారా స్వాధీనం

- ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలో మూడో గేటు వద్ద సోమవారం నిర్వహించిన సోదాల్లో నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎన్ఫోర్స్‌మెంట్ సిఐ పవన్ తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడిం చారు. చిత్తూరు నగరంలోని మూడో గేటు వద్ద దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విజయరాజ్ వద్ద 100ఎంఎల్ 150 నాటుసారా ప్యాకెట్లు సాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అర్బన్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్‌మెంట్ సిబ్బంది సుబ్రమణ్యం, దేవప్రసాద్, రాజేష్, ఢిల్లీబాబు, తంబీష్, కృష్ణవేణి, దీప పాల్గొన్నారు.

సారా విక్రేతను అరెస్ట్ చూపుతున్న అధికారులు

సీఎంను కలిసిన ఉయ్యాల రమణ

ప్రజాశక్తి-రొంపిచెర్ల: రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ సోమవారం సీఎం చంద్రబాబును నారావారిపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంపై సిఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రమణ రొంపిచెర్లలో విలేకరులతో మాట్లాడుతూ తనకు డైరెక్టర్ పదవి ఇచ్చినందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, మంత్రి లోకేష్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. చిత్త శుద్ధితో పనిచేసి కురబ సామాజిక వర్గ సమస్యల పట్ల కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఘన సన్మానం

కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణకు ఆయన అభిమానులు సోమవారం ప్రత్యేక అభినందనలు తెలిపారు. రొంపిచెర్ల మండల హెడక్వార్టర్స్‌లోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రొంపిచెర్ల మండలం, బండకిందపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షులు ఊటుకూరి మదన్మోహన్ రెడ్డి, గ్రామ వాటర్‌షెడ్ ఛైర్మన్ భాస్కరయ్య, నాయకులు ఖాదరవల్లి, శ్రీనాథ్ రెడ్డి, భారేషా వలి, ముబారక్, ఇమ్రాన్, ఆనంద, అశోక్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

- గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: క్రీడలు ఉల్లాసాన్ని కలిగిస్తాయని గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామని మనిషి మనుగడలో క్రీడలు ముఖ్యమైందని, ఆరోగ్యవంతులుగా తయారవు తామన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు గిరిజ, సుశీల పలువురు పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్ళకపోతే రాజీనామా చేయండి

- టిడిపి నాయకుడు సుకుమార్ బాబు

ప్రజాశక్తి-పుంగనూరు: రాష్ట్ర సమస్యలపై అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా, ప్రజాప్రతినిధులుగా ఎన్నికయిన అనేక మంది ఎమ్మెల్యేలు సభకు వెళ్ళకుండా తప్పించుకు తిరగడం బాధాకరమని, ఇటువంటి వారు వెంటనే రాజీనామా చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు, విశ్రాంత డిఎస్పీ సుకుమార్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. శాసనసభ ప్రత్యక్ష ప్రసారాలు గమనిస్తున్నామని, పలువురు ఎమ్మెల్యేలు సభలకు గైర్హాజరు అయ్యారన్నారు. వీరికి ప్రభుత్వం లక్షలాది రూపాయల జీతాలు, భత్యాలు, అనేక సదుపాయాలు కల్పించడం శుద్ధదండగ అన్నారు. ఇటువంటి వారు రాజీనామాచేసి వెళితే వారికి గౌరవం దక్కుతుందన్నారు. నియోజకవర్గాల ప్రజలు స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఇప్పటి వరకు ప్రజలు వారి బతుకులు ఏమాత్రం మారలేదని, ముఖ్యంగా పుంగనూరు నియోజకవర్గంలో స్వంత ఎమ్మెల్యే లేకపోవడం, పక్క నియోజకవర్గాల నుంచి వచ్చి ఇక్కడ నాటుకుని బాగా సంపాదించుకోవడం మాత్రమే ఇన్ని ఏళ్ళలో జరిగింది అని ప్రజలు మోసపోయినరని ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బాడాల కృష్ణమూర్తిరావు, యశ్వంత్ బహుదూర్ వీర బసవ చిక్కరాయల్, రాణి సుందరమ్మణ్ణి బగ్గిడిగోపాల్, రామకృష్ణారెడ్డి, శ్రీధర్ రెడ్డి మినహా తక్కిన వారంతా ఇతర మండలాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారే అన్నారు. ఇలా శాసనసభలకు వెళ్ళకుండా ప్రజాధనం దుర్వినియోగం చేయడం కంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో టిడిపి కార్యకర్త మృతి

మనోహర్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-పూతలపట్టు: మండలంలోని కొండ కిందపల్లికి చెందిన మనోహర్ నాయుడు(48) రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందాడు. పూర్తి వివరాలు.. మనోహర్ నాయుడు సోమవారం మధ్యాహ్నం స్వగ్రామం నుంచి స్కూటర్లో పాకాలకు వెళుతుండగా అయ్యప్పగారిపల్లి వద్ద పాకాల నుంచి పాటూరుకి వస్తున్న ఆటో అతివేగంగా వచ్చి మనోహర్ నాయుడు స్కూటర్ని ఢీకొనడంతో ఆయన రహదారి పక్కనున్న ఫెన్సింగ్ కమ్ములపై పడ్డాడు. తలకు, కాళ్లకు బలమైన గాయాలవడంతో మనోహర్ నాయుడు అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే ఈతలో ఆరు పిల్లలు

ఒకే ఈతలో ఆరు పిల్లలకు జన్మనిచ్చిన ఓ మేక పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా ఒక ఈతలో రెండు, మూడు పిల్లలు పుట్టడం చూశాం. కానీ ఆ మేక ఏకంగా ఆరు పిల్లలకు జన్మనిచ్చింది. జిల్లాలోని వెదురుకుప్పం మండలం గుర్రంవారికండ్రిగ గ్రామంలోని రైతు రామకృష్ణా రెడ్డి ఇంట ఈ సంఘటన జరిగింది. ఆ మేక పిల్లలు ఆరోగ్యంగానే ఉన్నట్లు రైతు తెలిపారు.

- ప్రజాశక్తి-వెదురుకుప్పం

గోకులం.. పాడి రైతుకు వరం: ప్రేమ్‌కుమార్

గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ప్రేమ్‌కుమార్

కుప్పం మండలం గరిగచీనేపల్లి గ్రామంలో సోమవారం కుప్పం మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్ కుమార్ గోకులం షెడ్డును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోకులం షెడ్డు పథకం పాడి రైతుల పాలిట వరం అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పాడి రైతుల ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రం ఆర్థికంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పరిస్థితులలో సీఎం చంద్రబాబు గోకులం షెడ్డు పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఇన్‌ఛార్జ్ జ్యోతి, అనిమల్ హస్బెండ్రీ అధికారులు, నాయకులు ఏవి రవి, చంద్ర, శ్రీనివాసులు, నరసింహులు, శశి, శక్తి వేలు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

- ప్రజాశక్తి-కుప్పం రూరల్

శ్రీధర్ బాబు సేవ ఆదర్శనీయం

శ్రీధర్ బాబును సన్మానిస్తున్న ఎస్‌టియు నాయకులు

జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా అమరావతిలో రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకులుగా ఎన్నికైన మేలుమయి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్ బాబుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న సందర్భంగా గంగవరం ఉన్నత పాఠశాలలో సోమవారం పలమనేరు డివిజన్ ఎస్టియు సంఘం తరపున ఘనంగా సన్మానించారు. అతను చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ అవార్డును అందజేసిందని ఎస్‌టియు సభ్యులు తెలిపారు. గతంలో పత్తికొండ ఉన్నత పాఠశాలలో పనిచేసిన సందర్భంగా శ్రీధర్ బాబు పాఠశాల ఎదుగుదలకు తమ సొంత నిధులను ఖర్చుచేసి అభివృద్ధి చేపట్టాడని వందల మంది విద్యార్థులను ఆదర్శవంతులుగా చేసి ఉన్నత చదువులకు పంపించిన ఘనత ఆయనకే దక్కిందని పలువురు కొనియాడారు.

- ప్రజాశక్తి-గంగవరం

క్రైం కార్నర్

స్టేషన్‌కు పిలిపించారని అవమానంతో ఆత్మహత్య

పల్ల దేవేంద్ర (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-పుంగనూరు: స్నేహితునికి సహాయం చేశాడని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి సంఘటనపై విచారించగా ఇది అవమానంగా భావించిన పల్ల దేవేంద్ర (32) సోమవారం చింత చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన మండలంలోని బోడెవారిపల్లి గ్రామంలో జరిగింది. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు ఇలా.. చౌడేపల్లి మండలం ఎస్ అగ్రహారం గ్రామానికి చెందిన వెంకటస్వామి కుమారుడు చిరంజీవి పెళ్లై పిల్లలు ఉన్నారు. ఇతను పుంగనూరు పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. పట్టణానికి చెందిన ఓ వివాహిత అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నది. వీరిద్దరూ అక్రమ సంబంధం కలిగి ఉన్నట్లు చెప్పారు. ఈనెల 15న వీళ్లిద్దరూ కలిసి పరారీ అయ్యారు. ఈ జంటకు చిరంజీవి స్నేహితులైన మండలంలోని బోడెవారిపల్లి గ్రామానికి చెందిన లేట్ కృష్ణమూర్తి కుమారుడు పల్ల దేవేంద్ర, చిన్న రమణ విశ్వనాథ్ ప్రసాద్ వీరందరూ కలిసి బెంగళూరులో కూరగాయల వ్యాపారం చేసేవారు. వీరందరూ స్నేహితులు అయ్యారు. ప్రసాద్‌కు ఇతియోస్ కారు ఉంది. ఆ కారును దేవేంద్ర అద్దెకు తీసుకుని చిరంజీవికి ఇచ్చాడు. కారులో జంట పరారీ అయ్యారు. సంఘటనపై వివాహిత అన్న అరుణ్ కుమార్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆదివారం పల్ల దేవేంద్ర, చిన్న రమణ, విశ్వనాథ్, ప్రసాద్‌లను స్టేషన్‌కు పిలిపించి విచారించి తిరిగి సోమవారం రమ్మని చెప్పి పంపించారు. ఈ సంఘటనను అవమానంగా భావించిన పల్లా దేవేంద్ర బోడెవారిపల్లి పల్లె గ్రామం వ్యవసాయ పొలంలో చింత చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

ద్విచక్ర వాహనం కోసం ఘర్షణ

- దివ్యాంగునిపై దాడి



ప్రజాశక్తి-పుంగనూరు: మండలంలోని మాగాండ్ల పల్లి పంచాయతీ బరినెపల్లి గ్రామానికి చెందిన వెంకటప్ప కుమారుడు దివ్యాంగుడు అశోక్ (35) ద్విచక్ర వాహన విషయమై ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో అశోక్ తీవ్ర గాయాలపాలై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బరినెపల్లి గ్రామానికి చెందిన అశోక్, బాలాజీలు అన్నదమ్ములు. బాలాజీకి స్నేహితుడైన కమతంపల్లి రమేష్‌కు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. బాలాజీ తన ద్విచక్ర వాహనం కొన్ని రోజులు వాడుకునేందుకు రమేష్‌కు ఇచ్చాడు. బైక్ ఇవ్వమని పలుసార్లు అడిగిన తిరిగి ఇవ్వకపోవడంతో ఆదివారం రాత్రి అన్న అశోక్‌ను తీసుకొని కమతం పల్లెకు వెళ్లి తన బైక్ ఇవ్వాలని స్నేహితుడు రమేష్ నిలదీశారు. రమేష్ అన్న ప్రసాద్ దివ్యాంగుడైన అశోకును కర్రతో తల, శరీరంపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అశోక్ తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR.
I.A.No. 56 of 2023
O.S.No. 160 of 2023
Between:
R. Sreeramulu Reddy, Represented by his son as General Power of Attorney Holder R. Vasudeva Reddy
....**Petitioner/Plaintiff.**
And
N. Subramanyam Reddy and 5 others
......**Respondents/defendants.**
NOTICE TO THE RESPONDENT NO.2.
To
Smt. K. SRIDEVI, W/o Late K. Eswara Reddy, D/o Late K. Jayarama Reddy, D.No. 20-3-15V, Sivajyothi Nagar, Jeevakona Road, Tirupati-517501.
The petitioner has filed a petition for grant of temporary injunction under Order 39 rules 1 and 2 and Section 151 C.P.C. in the above matter. If you have got any objection you may appear this Court at **10-30 A.M.** on **02-12-2024** either in person or through an advocate and file your objection if any. If you fail to do so, the matter will be decided ex-parte in your absence.
SRI. N. KESAVULU REDDY,
Advocate for petitioner.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి, లక్కిరెడ్డిపల్లె
I.A No. 1158 /2023 in O.S.No. 169/2023
అవులశెట్టి నాగరాజ, తండ్రి ఉత్తన్న, వ్యవసాయం, అవుల శెట్టిపల్లి, గోరన్ చెరువు గ్రామం , గాలివీడు మండలం, అన్నమయ్య జిల్లా. ...వాది/పిటీషనర్
Vs
1.N. జయప్రకాష్ నాయుడు తండ్రి జగనాథ నాయుడు, హిందూ, వయస్సు 40 సం, వ్యవసాయం,
2.N. సరస్వతమ్మ భర్త నాగరాజా, చెరువు గ్రామం, గాలివీడు మండలం, అన్నమయ్య జిల్లా,
3.N. కుమారమ్మ భర్త జయచంద్ర నాయుడు, హిందూ, వయస్సు 60 సం, వ్యవసాయం
పై ముగ్గరి నివాసం అవులసెట్టి వారి పల్లె, గోరాన్ చెరువు గ్రామం , గాలివీడు మండలం, అన్నమయ్య జిల్లా,
4.కవిలి లక్ష్మీదేవి, భర్త దొర రాజు, హిందూ, వయస్సు 55 సం, వ్యయసాయం,
5. కదిరి పరమేశ్వరి భర్త రాజకుమార్, హిందూ, వయస్సు 53 సం, వ్యయసాయం,
4 మరియు 5 నివాసం ఎసేనేనిపల్లి,తిమ్మ కుప్పం గ్రామం, బంగారు పాళ్యం మండలం, చిత్తూరు జిల్లా
6.రంగనాయుని సురేంద్ర నాయుడు తండ్రి సీతప్పనాయుడు, హిందూ, వయస్సు 55 సం, వ్యవసాయం, నాయుని వారిపల్లె నివాసం, గాలివీడు మండలం, అన్నమయ్య జిల్లా.
...ప్రతివాదులు
4 & 5 ప్రతివాదిలకు సమన్లు మరియు నోటీసులు
పై నంబర్ యొక్క దావా నందు 1 నుండి 6 వరకూ ప్రతి వాదులు అయన మీ పైన వాది పై కోర్టు నందు క్రింది సేడ్యులు దావా ఆస్తి పైనా పెరమనెంట్ ఇంజక్షన్ దావా మరియు ఇంజక్షన్ కోరుతూ పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. శ్రీకోర్ట్ వారు 20.12.2024 తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు 4&5 ప్రతివాదులు అయన మీకు వాయిదా ఉన్నది.కావున మీరు కానీ, మీ తర్పున వకీలు గానీ హాజరై అకేషేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పైన పరోక్షంగా తీర్మానించబడును అని తెలువడమైనది.
SCHEDULE
గాలివీడు మండలం, అన్నమయ్య జిల్లా, గోరన్ చెరువు గ్రామ సర్వే నెంబర్ 835/1 Ac.8.98 సెంట్లు పైకి విస్తీర్ణం పైకి Ac.1.00 సెంట్లు చెక్కు బందితో సహా.
//కోర్ట్ ఉత్తర్వ మేరకు//
పి.రెడ్డెన్న,
న్యాయవాది
లక్కిరెడ్డిపల్లి, 9440151312. అన్నమయ్య జిల్లా .